




డీఐజీని కలిసిన ఎస్పీ

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

- కర్నూలు క్రైం(ఆంధ్రజ్యోతి)

సమగ్ర వివరాలు ఇవ్వండి

- ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- అధికారులు, ప్రజా సంఘాలతో సమీక్ష



మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాలపై ఆయా శాఖల వారిగా సమగ్రమైన వివరాలను ఇవ్వాలని ఎస్సీ ఉప కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశానికి సంబంధించి ఏకసభ్య కమిషన్ సభ్యులు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ అంశంపై ప్రజా సంఘాలు, వివిధ సంస్థల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ సభ్యు డు రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆగస్టు 1, 2024న వెలువరించిన సుప్రీం కోర్టు ఉత్తర్వులను అనుసరించి ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని పూర్వ జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ఈ అంశంపై వ్యక్తులు, సంస్థల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఉప కులాల వారిగా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సమగ్రమైన వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఏకసభ్య కమిషన్ సిఫారసులను అందిస్తుందని అన్నారు. ఉప కులాల వారిగా విద్య, ఉపాధి రంగాల్లో ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీనికి ఒక నమూనా ఇచ్చామని అన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలు ఎన్ని ఉన్నదీ ఉప కులాల వారిగా వివరాలు ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. అలాగే అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారి వివరాలను కూడా సమగ్రంగా ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాల వారిగా పూర్తి స్థాయిలో సమగ్రంగా వివరాలను పంపాలని అధికారులను ఆదేశించారు.

వినతుల స్వీకరణ: అనంతరం షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణకు సంబంధించి వ్యక్తులు, వివిధ సంస్థల నుంచి వినతులను ఏకసభ్య కమిషన్ స్వీకరించింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ పాలనాధీశులు ఎవరు..?



రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గాల నియామకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సంక్రాంతి నాటికి ఏఎంసీల నూతన పాలనాధీశులు కొలువుదీరే అవకాశం ఉంది. చైర్మన్, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను నామినేట్ చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్లు ఖరారు చేశారు. పదవుల పందేరంలో ఆశావహులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో దాదాపుగా ఖరారు అయినప్పటికీ మెజార్టీ నియోజకవర్గాల్లో మార్కెట్ చైర్మన్‌గా సమర్థవంతమైన వ్యక్తిని ఎంపిక చేసేందుకు ఎమ్మెల్యేలు కసరత్తు చేస్తున్నారు. త్వరలో చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్ల జాబితా పంపాలంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలకు అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏఎంసీ నామినేటెడ్ పదవుల పందేరంతో రాజకీయ వేడి రాజుకుంది.

- ఏఎంసీల నూతన పాలకవర్గాలపై కసరత్తు
- ఉమ్మడి కర్నూలులో 15 మార్కెట్ యార్డులు
- రిజర్వేషన్లు ఖరారు చేసిన కలెక్టర్లు
- చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపికలో ఎమ్మెల్యేలు బిజీ
- సంక్రాంతి నాటికి పదవులు భర్తీ చేసే అవకాశం
- కీలక నాయకులపై ఆశావాహుల ఒత్తిళ్లు

కర్నూలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలు రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరిగితే.. మంత్రాలయం (కోసిగి), కోడుమూరు, ఆలూరు మార్కెట్‌లు అలంకారప్రాయంగా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల మార్కెట్లలో రెగ్యులర్‌గా క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన మార్కెట్ యార్డులు వారాంతపు మార్కెట్లుగా మారితే.. కొన్ని పేరుకే మార్కెట్‌లుగా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు మార్కెట్లలో ఏడాదికి రూ.3,600 కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరుగతున్నాయి. మార్కెట్ సెస్సు రూపంలో రూ.36 కోట్లు ఆదాయం వస్తోంది. నంద్యాల జిల్లాలో ఎనిమిది మార్కెట్ యార్డుల పరిధిలో ఏడాదికి రూ.2,600 కోట్ల విలువైన వ్యవసాయ పంట ఉత్పత్తుల లావాదేవీలు జరుగుతున్నాయి. సెస్సు ద్వారా రూ.26 కోట్లు ఆదాయం వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం 2022లో మార్కెట్ కమిటీలకు నూతన పాలవర్గాలను నియమించింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలల తర్వాత నామినేటెడ్ పదవుల పంపకానికి శ్రీకారం చుట్టింది.



రిజర్వేషన్లు ఖరారు చేసిన కలెక్టర్లు

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్ల నియామకాల్లో ఎస్టీలకు 6 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మిగిలిన పదవులు ఓపన్ కేటగిరి (ఓసీ)లో భర్తీ చేయాల్సి ఉంటుంది. మొత్తం స్థానాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. ప్రతి మార్కెట్ కమిటీలో వ్యవసాయ/ఉద్యాన శాఖ, కో-ఆపరేటివ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, పంచాయతీ/మున్సిపాలిటీల నుంచి నలుగురు ప్రభుత్వ అధికారులు, ముగ్గురు ట్రేడర్స్, 13 మంది రైతులు కలిపి 20 మంది డైరెక్టర్లు ఉంటారు. రిజర్వేషన్లు ఖరారు చేయాలని డిసెంబరు 10న జిల్లా కలెక్టర్లు, మార్కెంటింగ్ శాఖ ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

గతంలో రిజర్వేషన్లు పరిగణలోకి తీసుకున్న అధికారులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. కర్నూలు జిల్లాలో కర్నూలు, పత్తికొండ ఏఎంసీ చైర్మన్ పీఠాలు ఓసీ జనరల్, కోడుమూరు, మంత్రాలయం ఓసీ మహిళా, ఆదోని బీసీ/మైనార్టీ మహిళా, ఎమ్మిగనూరు బీసీ/మైనార్టీ జనరల్, ఆలూరు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఏడింటిలో మూడు స్థానాలు మహిళలకు ఇచ్చారు.

వివరాలు 6లో..

ఉల్లి, కంది మరింత కుదేలు




రైతులు అమ్మకానికి తెచ్చిన కందులు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం పంటల దిగుబడి బాగానే ఉన్నా ధరలు మాత్రం రోజురోజుకూ పతనం అవుతున్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులు దిగాలుపడుతున్నారు. ముఖ్యంగా ఉల్లి, కంది ధరలు బాగా పడిపోయాయి. గత వారం ఉల్లిగడ్డలు క్వింటం గరిష్ఠ ధర రూ.4వేలకు పైగానే పలికింది. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో ఆ ధర రూ.2,779కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.2,285, కనిష్ఠ ధర రూ.1,635కు తగ్గింది. కందులకు గరిష్ఠ ధర రూ.8,018, మధ్యస్థ ధర రూ.7,196, కనిష్ఠ ధర కేవలం రూ.3,966 మాత్రమే దక్కింది. ఎండుమిరప కాయల ధర గరిష్ఠంగా క్వింటానికి రూ.16,100 మధ్యస్థ ధర రూ.11,769, కనిష్ఠ ధర రూ.2,222 రైతుల చేతికి అందింది. వేరుశనగ కాయలు గరిష్ఠ ధర రూ.6,400, మధ్యస్థ ధర రూ.5,212, కనిష్ఠ ధర రూ.4,512 దక్కింది. మొక్కజొన్నలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర దక్కలేదు. క్వింటం మొక్కజొన్నలకు కేంద్రం రూ.2,550లు మద్దతు ధర ప్రకటిస్తే.. కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటానికి గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు రూ.2,109 రైతులకు అందింది. మినుములు గరిష్ఠ ధర రూ.7,911, మధ్యస్థ ధర రూ.7,911, కనిష్ఠ ధర రూ.7,011 మాత్రమే దక్కింది. సజ్జలకు గరిష్ఠ ధర రూ.2,711, మధ్యస్థ ధర రూ.2,339, కనిష్ఠ ధర రూ.2,241 దక్కింది. ఆముదాలకు గరిష్ఠంగా రూ.5,600, మధ్యస్థం రూ.5,459, కనిష్ఠంగా రూ.4,090 పలికింది.

చెరువులో పట్టాలు

- ఎలా ఇస్తారంటున్న ఆయకట్టు రైతులు
- కబ్జా అయిన సగం చెరువు

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో చెరువులకు చాలా ప్రాధాన్యత ఇచ్చారు. ఊరి శివారులో చెరువు తవ్వుకుంటే వర్షం నీరు నిలిచి పంట పొలాలకు ఉపయోగపడతాయి. భూగర్భ జలాలు పెరుగుతాయి. పశు పక్ష్యాదులకు దాహం తీర్చుతాయి. అనేక రకాలుగా మేలు చేసే చెరువులు ఇప్పుడు అన్యాక్రాంతమవుతున్నాయి. మండలంలోని ఎడవలి గ్రామం గొంది వెంకన్న చెరువును దాదాపు 50 ఎకరాల్లో తవ్వారు. సర్వే నెంబర్లు 288, 318, 321, 317/1బి, 319, 321, 325/1, 327, 325లో 33 ఎకరాలు ఉండగా..



322/1బీలో 14 ఎకరాల 16 సెంట్ల భూమిని గ్రామానికి చెందిన 11 మంది రైతులు పట్టాలు పొందారు. గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు ఆ గొంది చెరువు నమ్ముకుని 150 ఎకరాల వరకు పంటలను సాగు చేస్తున్నారు. అయితే 1997లోనే తమకు ఆ చెరువులో 14 ఎకరాలు పట్టాలు ఇచ్చారని గ్రామానికి చెందిన రాధాముని రెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీదేవితో పాటు మరో ఆరుగురు తెలిపారు. కానీ చెరువులో పట్టాలు ఎలా ఇస్తారంటూ గ్రామానికి చెందిన రైతులు ప్రశ్నిస్తున్నారు. గొంది వెంకన్న చెరువుకు రైతులు తూము కూడా ఏర్పాటు చేసుకున్నారు. చెరువుకు హంద్రీ నీవా నీరు నింపడం వల్ల నీరు పుష్కలంగా ఉండటంతో పంచాయతీవారు చేపలు కూడా వదిలారు. పట్టాలు పొందిన రైతులు మాకు చెరువుల్లో పొలం ఉంది కాబట్టి చేపలు వచ్చిన డబ్బులో సగభాగం ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కూడా విచారణ చేపట్టారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున మామూళ్లు తీసుకుని పట్టాలు ఇచ్చారని గ్రామస్థులు తెలుపుతున్నారు.



పరిశీలిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

చెరువులో పట్టాలు ఎలా ఇస్తారు

గొంది వెంకన్న చెరువులో రెవెన్యూ అధికారులు పట్టాలు ఎలా ఇస్తారు? చెరువులో నీరు ఉన్నందు వల్ల పొలంలోని వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు కూడా పెరుగుతున్నాయి. రెవెన్యూ అధికారులు ఆ పట్టాలు రద్దు చేసి ఆయకట్టుకు చెరువు నీరు అందేలా చూడాలి.

- నంది జయరాముడు, ఎడవలి

మాకు పట్టాలు ఇచ్చారు



గొంది వెంకన్న చెరువులో రెవెన్యూ అధికారులు కొన్నేళ్ల కిందటే మాకు పట్టాలు ఇచ్చారు. ఆన్‌లైన్ కూడా అయింది. పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆ చెరువులో మాకు భాగం ఉంది. కాదంటే రెవెన్యూ అధికారులు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం భూమి విలువ కట్టించి ఇస్తే వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.

- మునీశ్వరరెడ్డి, ఎడవలి

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గొంది వెంకన్న చెరువు సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. గతంలో కొంత మంది రైతులు పట్టాలు పొందారు. రికార్డులో కూడా అదే ఉంది. జిల్లా అధికారులకు ఈ విషయం చెప్పాం. వారి ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం.

- తహసీల్దార్, హుశేన్ సాహెబ్

ఆలోచింపజేసిన చిగురు మేఘం

- ఆకట్టుకున్న 'ఇది ఇతని సంతకం కాదు'
- రెండో రోజు రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు

6లో



చిగురుమేఘం సాంఘిక నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

నేటి నుంచి పత్తి కొనుగోళ్ల నిలిపివేత

ఆదోని అగ్రికల్చర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి మూడు రోజులపాటు తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లను నిలిపిస్తున్నట్లు సీసీఐ ఆదోని ఇన్‌చార్జిలు భరత్, గౌతం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పత్తి భారీగా నిల్వ ఉందని, ఐదో తేదీ వరకు కొనుగోలు చేయలేమన్నారు. 6వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోళ్లను ప్రారంభిస్తామని రైతులు గమనించాలని సూచించారు.

నంద్యాల జిల్లాలో తొలి బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు

- కొలిమిగుండ్ల మండలంలో ఏర్పాటు చేసే అవకాశం
- పోసూరు, పెద్దపల్లి మధ్య సోలార్ యూనిట్
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

7

బోరుబావిలో పేలుడు

ముగ్గురికి గాయాలు

మృత్యువులోనూ వీడని దాంపత్యం

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

7

పొదుపు మహిళల అభివృద్ధికి కృషి చేస్తాం

నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం. సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.సుబ్బారెడ్డి

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాబార్డు సౌజన్యంతో గ్రామాల్లోని పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామని నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం. సుబ్బారెడ్డి అన్నారు. గురువారం నాబార్డు నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని డ్వాక్రా మహిళలు వ్యాపార సముదాయాలు నిర్మించుకోవడానికి డీఆర్‌డీఏకి రూ.3.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నాబార్డు సౌజన్యంతో గోసానిపల్లె, దొర్నిపాడు గ్రామాలతో పాటు మద్దికెరలో మూడు కూరగాయల మార్కెట్లు నిర్మించినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు వ్యాపారం చేసుకోవడానికి రూ.7 లక్షలతో ఉచితంగా గదులు నిర్మించి ఇస్తామని తెలిపారు. గ్రామ వికాస్ నిధుల కింద గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వీరభద్రప్ప, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సర్పంచ్ సుహాసిని, బొమ్మనపల్లి ఆంజనేయులు, మదనంతపురం శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ శ్రీరాములు, వి. నాగేశ్వరరెడ్డి, మెడికల్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



తరగతి గదిలో..

ఆత్మకూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఆత్మకూరు ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఓవైపు నల్లమల అడవుల అందాలు.. మరోవైపు కృష్ణమ్మ పరవళ్లు.. చెంతనే కొలనుభారతి క్షేత్రంలోని సరస్వతీ అమ్మవారి చల్లని ఆశీస్సులు కలగలిసిన ఆత్మకూరులో ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యను చదవాలంటే సాహసం చేయాల్సిందే. ఆ పరిస్థితుల్లో ఎంతో మంది కృషి ఫలితంగా 1974లో ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. నాటి నుంచి నేటి వరకు యాభై ఏళ్ల ప్రస్థానంలో ఈ కళాశాలలో వేలాది విద్యా కుసుమాలు వికసించాయి. వీరిలో ఎంతో మంది దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడి సమాజంలో అత్యున్నత స్థాయిలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 వసంతాలను పూర్తి చేసుకున్న శుభసందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు స్వర్ణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకలను అద్భుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్వర్ణోత్సవాల వేళ...

- స్వర్ణోత్సవాలకు సిద్ధమైన ఆత్మకూరు జూనియర్ కళాశాల
- అనేక ఒడిదుడుకుల నడుమ 1974లో ఏర్పాటు
- 50ఏళ్ల ప్రస్థానంలో వేలాదిగా వికసించిన విద్యా కుసుమాలు
- 4,5 తేదీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50ఏళ్లను పురస్కరించుకుని కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులతో భారీ ఆత్మీయ సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. జనవరి 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుక అంబరాన్ని తాకేలా ప్లాన్ చేశారు. స్వర్ణోత్సవాల సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఇంటర్ బోర్డు కమిషనర్ క్రితికా శుక్లా, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కడప ఆర్‌జేడీ రవి హాజరు కానున్నారు.

పూరి గుడిసెల్లో మొదలై...

ఆత్మకూరులో 1974లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైన సందర్భంలో రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉండేవి. వాటిని ప్రిన్సిపాల్, ఆఫీసు కార్యకలాపాలకు వినియోగించేవారు. తరగతులను మాత్రం గుడిసెల్లోనే నిర్వహించేవారు. ఈ గుడిసెల్లో విద్యాబోధన కష్టతరంగా ఉండటంతో పాఠశాలలోని ఒకటి, రెండు గదులను వాడుకునేవారు. ఈక్రమంలోనే 1977 నవంబరులో దివిసీమలో సంభవించిన ఉప్పెన విపత్తు సందర్భంలో ఆత్మకూరులో కూడా భారీ వర్షాలు కురిసి జూనియర్ కళాశాల గుడిసెలన్నీ దెబ్బతిన్నాయి. 1978లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యే ఎన్నికై రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా వ్యవహరించిన కొక్కెరంచ వెంగళరెడ్డి కళాశాల గుడిసెలు దెబ్బతిన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విపత్తు నిధుల్లో భాగంగానే తరగతి భవనాల నిర్మాణాల కొరకు రూ.3లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ తరగతి గదులను ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంపై నిర్మించాల్సి ఉండగా అందుకు రూ.5లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉండటంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో వెన్నా రామకృష్ణారెడ్డినే తన సొంత నిధులను కలిపి 12 తరగతులతో పాటు ఆఫీసు, స్టోర్‌రూమ్‌లను నిర్మించారు.

1974...
రూ.లక్ష చందాలు వేసుకుని...

ఆత్మకూరుతో పాటు చుట్టుపక్కల ఉన్న వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలల్లోని వారికి ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించాలంటే ఎంతో వ్యయప్రయాసలు భరాయించాల్సి ఉండేది. స్థానికంగా ఇంటర్ కళాశాల లేకపోవడం వల్ల కర్నూలు, నంద్యాల, మార్కాపురం, నందికొట్కూరుకు వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో పెద్దగా రవాణా, హాస్టల్స్ వసతి లేకపోవడంతో నానా అగచాట్లు పడేవారు. ఒక విధంగా సామాన్యులకు ఇంటర్ విద్య కొంత భారంగానే ఉండేది. ఈ ఇబ్బందులు పడలేక మరికొందరైతే ఏకంగా చదువే మానేయాల్సి పరిస్థితులు ఉండేవి. దీంతో ఆత్మకూరులో జూనియర్ కళాశాల ఆవశ్యకత అందరిని కలిచి వేసింది. ఎలాగైనా జూనియర్ కళాశాలను తీసుకురావాలన్న తలంపుతో అన్ని మండలాల్లోని పలువురు పెద్దలు సమస్యను రాజకీయ నాయకుల చొరవతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే రూ.లక్ష ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లిస్తే కళాశాల ఏర్పాటు జరిగే అవకాశం ఉందన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. దీంతో ఆత్మకూరు ప్రాంతానికి చెందిన వెన్నా రామకృష్ణారెడ్డి, కడుమూరి మాసుంసా, మోమిన్ అహ్మద్‌హసేన్, మోమిన్ నద్దిముల్లా, దుద్యాల నాగలక్ష్మీరెడ్డి, చెంచిరెడ్డి మరికొంత మంది పెద్దలు కలిసి ఇంటింటికి వెళ్లి చందాలు సేకరించి ప్రభుత్వానికి లక్ష రూపాయలను డిపాజిట్ చేశారు. దీంతో అనేక ఒడిదుడుకుల మధ్య ఎట్టకేలకు 1974లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోనే జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు.

ఫస్ట్ బ్యాచ్ ఇలా..

ఆత్మకూరులో 1974లో ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలుత సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి 1974-76 బ్యాచ్‌లో 148 విద్యార్థులు ఉన్నారు. కళాశాల ఏర్పాటు సమయంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా ఆ తర్వాత మొట్టమొదటి ప్రిన్సిపల్‌గా గరిమెల్లి సీతారామయ్య, అధ్యాపకులుగా సీఎస్.కుమార్ (బాటనీ, జువాలజీ), మనోహర్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ), హుసేన్ (ఇంగ్లీష్), శేషఫణి శర్మ(తెలుగు), గోపాలకృష్ణ (కామర్స్), గరుడయ్యనాయుడు (జువాలజీ), రామయ్య(కామర్స్), సత్యనారాయణమూర్తి (ఎకనామిక్స్), సుదర్శన్ (జువాలజీ) ఉన్నారు. వీరిలో సీఎస్.కుమారు, సుదర్శన్ మినహా వారందరు మృతిచెందారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలి బ్యాచ్ అధ్యాపకులు(ఫైల్)



ప్రభుత్వ జూనియర్ కళాశాల తొలి బ్యాచ్ (1974-76) విద్యార్థులు

పూర్వ విద్యార్థుల్లో ప్రముఖులు..

ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గడిచిన 50ఏళ్లలో సుమారు 20వేల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసించగా వీరిలో ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారు. ప్రత్యేకించి ఇక్కడ చదివిన ఎం.జగన్నాథం ఐఏఎస్ కేడర్ హోదాలో పనిచేయగా శంకరశర్మ (ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యుడు), వీరబ్రహ్మం (డీఆర్‌డీఏ శాస్త్రవేత్త), ప్రకాష్‌రెడ్డి (హైకోర్టు అడ్వకేట్), విజయభాస్కర్ (ఎస్వీ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, నెల్లూరు), మృత్యుంజయరెడ్డి (ఇస్రో-శాస్త్రవేత్త), దివాకర్ (ప్రొఫెసర్ పాండిచ్చేరి), మునీశ్వరయ్య (ఇండియన్ బ్యాంకు మేనేజర్), ఎస్వీ ప్రసాద్, మల్లారెడ్డి (ఏపీజీబీ రిటైర్డు బ్యాంకు మేనేజర్లు), ఉమామహేశ్వరరెడ్డి (ఏడీ-అగ్రికల్చర్), ఏవీ నారాయణరెడ్డి (పారిశ్రామికవేత్త) ఉన్నారు. వీరేకాక మరెంతో మంది వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయిల్లో స్థిరపడ్డారు.

స్వర్ణోత్సవాలను విజయవంతం చేద్దాం



ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటై 50ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకలను విజయవంతం చేసేందుకు పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు, సామాజికవేత్తలు భాగస్వాములు కావాలని ఆశిస్తున్నాము. అందరి సహకారంతో ఇప్పటికే వేడుకల ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేశాము.

- రఘురామాచార్యులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

అదృష్టంగా భావిస్తున్నాము



ఆత్మకూరు ప్రాంతంలో ఇంటర్మీడియట్ కళాశాల లేనప్పుడు ఇంటర్ విద్య కోసం ఇక్కడి విద్యార్థులు పడిన కష్టాలు అన్నిఇన్ని కావు. ఆ సమయంలో మా తండ్రి వెన్నా రామకృష్ణారెడ్డితో పాటు ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన పలువురు ప్రముఖుల కృషి ఫలితంగా అనేక ఒడిదుడుకుల నడుమ 50ఏళ్ల క్రితం కళాశాల ఏర్పాటు సాధ్యమైంది. అప్పటి నుంచి నేటి వరకు వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన కళాశాల స్వర్ణోత్సవాలు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- వెన్నా భోగిరెడ్డి, పూర్వ విద్యార్థి, ఆత్మకూరు

చాలా ఆనందంగా ఉంది



విద్యాబుద్ధులు ప్రసాదించిన కళాశాల దిగ్విజయంగా 50ఏళ్లను పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి అద్భుత ఘట్టంలో తాను భాగస్వామ్యున్ని కావడం మరచిపోలే స్మృతిగా భావిస్తున్నాను. ఇప్పటికే ఎంతో మంది పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడం కూడా సంతోషించదగ్గ విషయం.

- సాజిద్‌బాషా, పూర్వ విద్యార్థి, సీనియర్ అకౌంటెంట్, ఆత్మకూరు సబ్‌ట్రెజరీ

మార్కెట్ పాలనాధీశులు ఎవరు?

(5వ పేజీ తరువాయి)

రిజర్వేషన్ల ఖరారుపై ఆరోపణలు

నంద్యాల జిల్లాలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, ఆత్మకూరు, కోవెలకుంట్ల, బనగానపల్లె మార్కెట్ కమిటీలు ఓసీ (జనరల్), నంద్యాల ఓసీ (మహిళ)కు కేటాయిస్తే.. ఆళ్లగడ్డ ఎస్సీ (మహిళ), డోన్, పాణ్యం బీసీ (మహిళ)కు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీలకు 21 శాతం రిజర్వేషన్ ప్రకారం రెండు మార్కెట్ కమిటీలు కేటాయించాల్సి ఉంది. ఎస్టీ రిజర్వేషన్‌ను పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ రిజర్వేషన్ మాత్రమే పరిగణలోకి తీసుకుని ఎస్సీలకు ఆళ్లగడ్డ చైర్మన్ రిజర్వేషన్ కల్పించి మహిళలకు కేటాయించారు. బీసీలకు రెండు రావాల్సి ఉంటే.. ఆ రెండు స్థానాలు మహిళలకు కేటాయించారు. వాస్తవంగా అయితే ఒకటి జనరల్, ఒకటి మహిళలకు ఇవ్వాలి. ఓపన్ కేటగిరి (ఓసీ) కింద నాలుగు మార్కెట్ల చైర్మన్ స్థానాలు కేటాయించాల్సి ఉంటే ఐదు మార్కెట్లు కేటాయించారు. అందులో మహిళలకు సగం అంటే.. కనీసం రెండు చైర్మన్ పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక స్థానంతో సరిపుచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆశావహుల ప్రయత్నాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు టీడీపీ నాయకులు అప్పటి నేతల వేధింపులతో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. ప్రతిపక్షంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకులు ఎందరో ఉన్నారు. మార్కెట్ యార్డు పదవుల పందేరంలో తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. కర్నూలు మార్కెట్ పీఠం కోసం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఆర్.చంద్రకళాధర్‌రెడ్డి పేరును పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు ప్రతిపాదించినట్లు సమాచారం. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోనేగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, వైస్ చైర్మన్‌గా నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన ఖాశీంవల్లి పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. పత్తికొండ మార్కెట్ చైర్మన్ పదవికి కృష్ణగిరి మండలానికి చెందిన నబీసాహెబ్ పేరు ఎంపిక చేశారని తెలుస్తుంది. ఆలూరు పీఠం కోసం ఆరేడుగురు పోటీ పడుతున్నా.. రాజారత్నం, నర్సప్ప, శేషగిరి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక ఆదోని రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్‌గా గుర్తింపు ఉంది. ఈ పీఠం బీసీ/మైనార్టీ మహిళకు కేటాయించారు. ఈ పీఠం కోసం కూటమి పార్టీల్లో తీవ్ర పోటీ ఉంది. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప భార్యకు ఆ స్థానం కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పొత్తుల్లో భాగంగా తమకే వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. అదే క్రమంలో మైనార్టీ కోటాలో టీడీపీ మైనార్టీ నాయకుడు ఉమ్మి సలీం, బీసీ వాల్మీకి కోటాలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆరేకల్లు రామకృష్ణలు ప్రయత్నాలు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో కూడా చైర్మన్ పదవుల కోసం ఆశావహులు ఎమ్మెల్యేలను కలసి ప్రయత్నాలు షురూ చేశారు. ఉమ్మడి జిల్లాలో రెండు మూడు నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు ఐదేళ్లు వైసీపీలో పార్టీ బలోపేతం కోసం కష్టపడిన కార్యకర్తలను కాదని ఎన్నికల ముందు, ఆ తరువాత టీడీపీలో చేరిన వారినే చైర్మన్‌గా ఎంపిక చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం విచారించి పార్టీ కోసం కష్టపడ్డ వారికే ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

మార్కెట్ కమిటీ చైర్మన్ల రిజర్వేషన్ల వివరాలు

మార్కెట్ కమిటీ	రిజర్వేషన్
కర్నూలు జిల్లా	
కర్నూలు	ఓసీ జనరల్
ఆదోని	బీసీ/మైనార్టీ (మహిళ)
కోడుమూరు	ఓసీ (మహిళ)
మంత్రాలయం	ఓసీ (మహిళ)
ఎమ్మిగనూరు	బీసీ/మైనార్టీ జనరల్
ఆలూరు	ఎస్సీ -జనరల్
పత్తికొండ	ఓసీ జనరల్
నంద్యాల జిల్లా:	
నంద్యాల	ఓసీ (మహిళ)
ఆళ్లగడ్డ	ఎస్సీ (మహిళ)
డోన్	బీసీ (మహిళ)
నందికొట్కూరు	ఓసీ జనరల్
ఆత్మకూరు	ఓసీ జనరల్
బనగానపల్లె	ఓసీ జనరల్
కోవెలకుంట్ల	ఓసీ జనరల్
పాణ్యం	బీసీ (మహిళ)

ఆలోచింపజేసిన చిగురు మేఘం

- ఆకట్టుకున్న 'ఇది ఇతని సంతకం కాదు'
- రెండో రోజు రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సత్కరించిన కళాకారులు

కర్నూలు కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైద్యులు పల్లెల నుంచి ఎదిగి, నగరాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు పెట్టి ధన సంపాదనే ముఖ్యమై పేదల వైద్య సేవలు మర్చిపోతున్నారనే ఇతివృత్తంతో సాగిన 'చిగురు మేఘం' నాటిక ఆలోచింపజేసింది. 'ఇది ఇతని సంతకం కాదు' అన్న మరో నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రెండో రోజు గురువారం రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు కొనసాగాయి. హైదరాబాదు మహతీ క్రియేషన్స్, కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ నాటిక ప్రదర్శనలను సినీ నటులు సుబ్బరాయ శర్మ, గోపరాజు రమణ, కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిష్ణాతులైన కళాకారులు తమ నాటికల ద్వారా ప్రేక్షకులకు వినోదాన్ని పంచడం ప్రశంసనీయమని అన్నారు. నాటకం సజీవమైనదని, దాన్ని ప్రాణపదంగా చూసుకోవడం కళాకారులకు ఒక పరీక్ష వంటిదని అన్నారు. కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలు ఇవ్వడం ఒక ప్రత్యేక సందర్భంగా నిలుస్తోందని చెప్పారు. కళాకారులకు తనవంతు చేయూత అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సన్మాన గ్రహీత, సినీ టీవీ రంగస్థల నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ 1995 నుంచీ నాటక రంగంతో అనుబంధం ఉందని, అనంతరం టీవీ, సినిమాల్లో రావడానికి సుబ్బరాయశర్మ సహకారం మర్చిపోనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీ బస్తిపాటి నాగరాజును కళాకారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, వ్యాఖ్యాత ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, వి.రాముడు, హార్మోనిస్ట్ పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నాటక ప్రదర్శనలు...

నాటకోత్సవాల్లో రెండో రోజు గురువారం రాత్రి ప్రదర్శించిన రెండు నాటికలు వేటికవే పోటీగా నిలిచాయి. తొలుత గుంటూరు అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిరుగు మేఘం' ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటకానికి పప్పూరి హరిబాబు దర్శకత్వం వహించారు. స్వయంగా పేదలైన తల్లిదండ్రులే కార్పొరేట్ ఆసుపత్రులకు వస్తే వారిని ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందీ ఈ నాటిక తెలియజేస్తుంది. కార్పొరేట్ నుంచీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి సేవలు చేసిన వైద్యుల జీవితం ధన్యం అనే సందేశంతో ఈ నాటకం పూర్తవుతుంది. ఇందులో వివిధ పాత్రల్లో ఏపూరి హరిబాబు, కోనపరెడ్డి మస్తాన్‌రావు, సరిత, కావూరి సత్యనారాయణ, నాగరాణి, ప్రసాద్, రాజశేఖర్‌లు నటించారు. రెండో నాటికగా గుంటూరు అభినయ ఆర్ట్స్ సంస్థ వారు 'ఇది ఇతని సంతకం కాదు' ప్రదర్శించారు. ఈ నాటికను స్నిగ్ధ రాయగా రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించారు. ప్రతి మనిషికి ఒక బలమైన లక్ష్యం, అందుకు తగిన ప్రణాళిక ఉండాలని అది లేని జీవితం వ్యర్థమని ప్రబోధిస్తుంది. సిద్ధాంతాలకు కట్టుబడి సాగించే జీవితం నిజమైన జీవితమని ఈ నాటిక తెలియజేస్తుంది.


అయ్యయ్యో... పాలపిట్ట..!

అశ్వినీ మాసంలో అడుగుపెట్టి.. శుక్ల పక్షంలో శోభనిచ్చి.. పంట చేనుల్లో పరుగులెడుతూ... విజయదశమికి విజయాలనిస్తుంది పాలపిట్ట. చూసేందుకు చూడచక్కని రంగులతో పసిడి పరువాల విహంగ అద్భుతాల పాలపిట్ట విలవిల్లాడి మృతి చెందిన ఘటన కోసిగి మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం చోటు చేసుకుంది. ఓ పాలపిట్ట విద్యుత్ వైరులో తల ఇరుకుని తల్లడిల్లుతూ ప్రాణం కోల్పోయింది. మిగతా పక్షులు అక్కడకు చేరుకుని పాలపిట్టను లేపే ప్రయత్నం చేయగా.. బలంగా వైరులో ఇరుక్కుపోవడంతో మృతి చెందింది. స్థానిక వీఆర్వో బలరాముడు, హనుమంతు విద్యుత్ వైరులో ఇరుకుని మృతి చెందిన పాలపిట్టను బయటకు తీసి పక్కనే ఉన్న వాగు దగ్గర పాతిపెట్టారు.

- కోసిగి (ఆంధ్రజ్యోతి)







వైరుకు వేలాడుతున్న పాలపిట్ట



7న సెపక్ తక్రా ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో ఆలూరులోని కేవీకే ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. 01.01.2005లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. జిల్లాకు ఈ నెల 17, 18 తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగే 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాల కోసం 9440257242ను సంప్రదించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి కష్టపడి పనిచేద్దాం



కలెక్టర్‌తో జేసీ, డీఆర్వో, అధికారులు, సిబ్బంది

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో కర్నూలు జిల్లా అభివృద్ధికి సమష్టిగా కష్టపడి పని చేద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులకు పిలుపునిచ్చారు. ఆంగ్ల నూతన సంవత్సర సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసీ నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి, సమష్టిగా పని చేద్దామని అన్నారు. క్యాంపు కార్యాలయంలో జేసీ నవ్యను అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచం మెచ్చిన నేత మన్మోహన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాలు మెచ్చిన మహానాయకుడు మన్మోహన్ సింగ్ అని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. దేశానికి నీతి వంతమైన పాలన అందించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు. భారత్, పాక్ రెండు దేశాలు సంతాప దినాలు ప్రకటించాయన్నారు. ఉపాధి హామీ పథకం ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నగర అధ్యక్షుడు జిలానీ బాషా, బి.క్రతుకన్న, అనంతరత్నం, దామోదరం రాధాకృష్ణ, మల్లీశ్వరి, శ్రీలత, ప్రమీల త పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌కు భూముల వివాదం



పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

ఆలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని మొలగవల్లి గ్రామంలోని మాణిక్య ప్రభు ఆలయ భూముల వ్యవహారం గురువారం పోలీసు స్టేషన్‌కు చేరింది. ఎన్నో ఏళ్లుగా 60 ఎకరాల ఆలయ భూములను రాఘవయ్య, మురళి స్వామి ఏడాదికి ఒకరు ప్రకారం సాగుచేసుకుంటున్నారు. కాగా రాఘవయ్య కుటుంబ సభ్యులు ఆలయ ట్రస్టుకు మార్చుకుని మీకు సంబంధం లేదని మురళి స్వామి కుటుంబీకులకు చెప్పారు. దీంతో మురళి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా బంధువు శ్రీధర్ వెంట ఉన్నారు ఎస్ఐ దిలీప్ కుమార్ శ్రీధర్‌ను గట్టిగా మందలించడంతో కుటుంబసభ్యులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ససేమీరా అన్నారు. చివరకు గతంలో మాదిరిగానే ఏడాదికి ఒక్కరు చొప్పున భూమిని సాగు చేసుకోవాలని నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

నంద్యాలలో తొలి బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు



- గత టీడీపీ ప్రభుత్వంలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టు
- తాజాగా సోలార్, విండ్ బ్యాటరీ స్టోరేజీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు
- కొలిమిగుండ్ల మండలంలో ఏర్పాటు చేసే అవకాశం
- హోసూరు, పెద్దహుల్తి మధ్య సోలార్ యూనిట్
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

కర్నూలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటంతాండ గ్రామాల మధ్య సోలార్, విండ్, హైడ్రో ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక (రెన్యూవబుల్) ఎనర్జీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు (ఐఆర్ఈపీ)కు శ్రీకారం చుడితే ఇది సాధ్యమేనా..? అంటూ పలువురు ప్రశ్నించారు. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఎక్కడా వినలేదు అన్నారు. ఆనాడు చంద్రబాబు ఆలోచన నుంచి పురుడుపోసుకున్న 5,230 మెగా వాట్ల సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు మార్చి నెలలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా సోలార్, విండ్ బ్యాటరీ స్టోరేజీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టును నంద్యాల, కడప జిల్లాల్లో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.

గురువారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నంద్యాల, కడప జిల్లాల్లో క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 119 మెగావాట్ల పవన విద్యుత్, 130 మెగావాట్ల సోలార్ హైబ్రిడ్ ఇంధనంతో పాటు బ్యాటరీ ఇంధనం స్టోరేజీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, కర్నూలు జిల్లాలో పత్తికొండ మండలం హోసూరు, పెద్దహుల్తి గ్రామాల మధ్య 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపుగా రూ.2 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. 1.380 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

స్టాఫ్ నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్

- జోన్-4లో 150 పోస్టులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ కడప జోన్-4 పరిధిలో 150 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగుల పోస్టుల భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి. రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల దరఖాస్తు నమూనా, వివరాలను Http://cfw.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను వెబసైట్ నుంచి డౌన్‌లోడు చేసుకుని భర్తీ చేసిన దరఖాస్తుతో పాటు నిర్దేశించిన దరఖాస్తు రుసుం, సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి ఈ నెల 3వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను రీజనల్ డైరెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం కడపలో అందజేయాలని కోరారు. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను తీసుకోమని తెలిపారు.

లైబ్రేరియన్‌ను శిక్షించాలి

- రోడ్డుపై విద్యార్థి సంఘాలు, విద్యార్థినుల బైఠాయింపు
- నిందితుడి అరెస్టు



పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు, విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల నాయకులు, కళాశాల విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. గురువారం బనవాసి ఫారంలోని ఆదోని రహదారిపై బైఠాయించారు. లైబ్రేరియన్‌ను తొలగించాలని, అరెస్టుచేసి శిక్షించాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. రెండు నెలలుగా లైబ్రేరియన్ వేధింపులకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపేవరకు గోప్యంగా ఉంచడం దారుణమన్నారు. కళాశాల అధికారుల ఉదాసీనతవైఖరి వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లైబ్రేరియన్‌ను విధుల నుంచి తొలగించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఐ శ్రీనివాసులు నిందితుడిని శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీరేష్‌యాదవ్, మహేంద్ర బాబు, రాజేష్, ఉదయ్, రాఘవేంద్ర, విజయేంద్ర, షాహిద్ అఫ్రిది పాల్గొన్నారు.

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

బాధితురాలు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లైబ్రేరియన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేశాని డీఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు అరెస్టు చేసినట్లు తెలిపారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఎమ్మిగనూరు: బనవాసి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విద్యార్థినిపై లైబ్రేరియన్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనకు బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఏపీఆర్ఈఐ సొసైటీ సెక్రటరీ మస్తానయ్య ఆదేశాలు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



రామగోవిందు, వరలక్ష్మి (ఫైల్)

కోడుమూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు-ప్యాలకుర్తి గ్రామాల మధ్య గురువారం సాయంత్రం కారు- బైక్ ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. కోడుమూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రామ గోవిందు (56), భార్య వరలక్ష్మి (50) బైక్ మీద కర్నూలు ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తూరు దాటాక నంద్యాల వెళుతున్న కారు ఢీకొట్టింది. బైక్ మీద ఉన్న దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు చేరుకుని మృతదేహాలను కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామగోవిందు, వరలక్ష్మి దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు.

బోరుబావిలో పేలుడు

- ముగ్గురికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు చంద్ర

ఆదోని, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బోరుబావిలో భారీ శబ్దంతో పేలుడు సంభవించి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదోని మండలం చిన్న పెండేకల్లు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురువ చంద్ర అనే రైతు తన పొలంలో నెల రోజుల క్రితం 250 అడుగుల లోతు వరకు బోరు వేయించాడు. గురువారం బోరు బావికి పైపులు, మోటార్‌ను అమర్చేందుకు వెళ్లాడు. పక్క పొలంలో ఉన్న జయరాముడు సహాయంతో చంద్ర, అతని భార్య బసమ్మ కలిసి మోటార్‌ను బోరు బావులోకి దించారు. మోటారు బోరులో ఉన్న నీళ్లలోకి పూర్తిగా దిగకపోవడంతో బలవంతంగా దించారు. ఇంతలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. బోరు దగ్గర ఉన్న ఈ ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల పొలంలో పనిచేస్తున్న వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం డాక్టర్ల సూచన మేరకు బంధువులు కర్నూలుకు తీసుకెళ్లారు.

పేలుడు ఎలా వచ్చింది?

బోరుబావిలో దించిన మోటారు పేలడంతో శబ్దం వచ్చిందా? లేక గిట్టని వాళ్లు ఏదైనా పేలుడు పదార్థాన్ని బోరు బావిలో వేశారా? అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

నగర పాలక సంస్థలో ఏసీ మాయం

- స్పందించని అధికారులు



ఏసీ ఎత్తుకెళ్లడంతో మిగిలి ఉన్న తీగెలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలోని జనన, మరణ ధృవీకరణపత్రాల జారీ విభాగంలో ఎయిర్ కండీషనర్ మాయం అయింది. ఎవ్వరు తీసుకెళ్లారో కూడ అర్థం కావడం లేదు. కార్యాలయానికి బయటి వైపు ఏర్పాటు చేసిన రెండు ఏసీలలో ఒకటి కనిపించకుండాపోయింది. కేవలం వైర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇది జరిగి వారం రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేస్తే ఏసీని మాయం చేసిన దొంగ దొరికిపోతాడు. కానీ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగే ఈ పని చేసి ఉంటాడని, అతను బైట పడటం ఇష్టం లేక అధికారులు ఫిర్యాదు చేయడం లేదని కొందరు భావిస్తున్నారు. పైగా ఆ ఉద్యోగి కీలక అధికారి వద్ద పని చేస్తుండటంతో కేసు నమోదు చేయడం లేదని ప్రచారం అవుతోంది.

కేసు నమోదుకు ఆదేశాలు

కార్యాలయం బయట ఉన్న ఎయిర్ కండీషనర్ మాయమైనట్లు తెలిసింది. దీన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సెక్యూరిటీ గార్డుల పనితీరు మెరుగుపరుచుకోవాలని అన్నారు. **-డాక్టర్ కే. విశ్వేశ్వరరెడ్డి, ఆరోగ్య అధికారి, నగర పాలక సంస్థ**

కన్నుల పండువగా తిరుప్పావడ సేవ



గోదా గోకుల క్షేత్రంలో విభిన్న రకాల నైవేద్యాలతో రంగనాథస్వామిని అలంకరించిన దృశ్యం

కర్నూలు కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మామిదాల పాడులోని గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో గురువారం నిర్వహించిన 'తిరుప్పావడ సేవ' కన్నుల పండువగా సాగింది. తిరు మలలో శ్రీవారికి నిర్వహించే తిరుప్పావడ సేవలాగే క్షేత్రంలో రంగనాథ స్వామి వారికి వివిధ రకాల పండ్లు, ఫలహారాలను నైవేద్యంగా సమర్పించి, ఆ నైవేద్యాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త మాట్లాడుతూ ధనుర్మాసం ముప్పయ్ రోజుల వేడుకల్లో తిరుప్పావడ సేవకు ప్రత్యేకత ఉంటుందని చెప్పారు. గోకులం మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, ఇటిక్యాల పుల్లయ్య, బాలసుధాకర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



పుష్పాల అలంకరణతో శంఖుచక్రాలతో తిరుమల శ్రీవారి చిత్రం

కర్నూలు కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో బళ్లారి రోడ్డు వై జంక్షన్, వాసవీనగర్‌లో వెలసిన వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా గురువారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితుడు శాస్త్రోక్తం గా చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజర య్యారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలం కరించారు. అలాగే శంఖు చక్రాల మధ్య తిరుమల శ్రీవారి రూపాన్ని పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డంకి కాదు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పేదరికం చదువుకు అడ్డంకి కాదని, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆర్టీసీ కర్నూలు రీజియన్ మేనేజర్ టి.శ్రీనివాసులు అన్నారు. గురువారం బీ.క్యాంపు సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో పూర్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీసెస్ సొసైటీ నిర్వాహకుడు వెంక ట శివుడు, ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల రిటైర్డు పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ శ్రీనాథ్, ఏపీఎస్పీ డీసీఎల్ రిటైర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లయన్ పి.వెంకటేశ్వర్లు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వెంకటరమణయ్య, ఉమామహేశ్వరి, కేశవ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి బీఈడ్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు బీఈడ్ 2వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 17 పరీక్ష కేంద్రాల్లో 3,650 రెగ్యులర్, 319 సప్లమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థుల బూట్ల సైజుల వివరాలు పంపండి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 1 నుంచి 9 వరకు చదువుతున్న విద్యార్థులకు సంబంధించి బూట్లు సరఫరా చేసేందుకు కొలతలను జనవరి 7వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర యాప్‌లో నమోదు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డీఈవో శ్యామ్యూల్ పాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్ఎస్‌జీ కమాండోకు సన్మానం

కర్నూలు అర్బన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా కళాశాల పూర్వ విద్యార్థి ఎన్ఎస్‌జీ కమాండో ఎద్దుల నరేష్‌ను సన్మానించారు. గురువారం ఉస్మానియా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్యదర్శి అజ్రా జావేద్, ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్‌లు, ప్లేస్మెంట్ ఆఫీసర్ మండి అన్వర్ హుస్సేన్‌లు హాజరై మాట్లాడారు.



నరేష్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

మహిళల ఉచిత శిక్షణ

కర్నూలు హాస్పిటల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో 18 నుంచి 35 సంవత్సరాలలోపు మహిళలకు ఎన్టీఆర్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో ఈ నెల 20 నుంచి 31లోపు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు మహిళా సాధికార కేంద్రం జిల్లా మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. సూయింగ్ మిషన్ ఆపరేటర్ 45 రోజులు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీ 60 రోజులు శిక్షణ ఉం టుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు నేరుగా కార్యాలయానికి వచ్చి సంప్రదించాలన్నారు. విద్యార్హతలు 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బయోడేటా తీసుకుని రావాలన్నారు.

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చేయాలి

ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు నాయకుల వినతి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ త్వరగా చేయాలని ఏపీ ఎమార్పీ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భైరాపురం రాజు, సుధాకర్, ప్రతాప్, పూలరాజు, సూరిబాబు, సోల్మాన్, విహార్, రాజశేఖర్, సుజాత, అయ్యమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

మాదిగలకు న్యాయం చేయాలి: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ అన్నారు. గురువారం చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు.

క్రిమిలేయర్ వర్తింపజేయాలి: ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు సంవత్సరానికి 15 లక్షల వార్షికాదాయం ఉంటే.. వారికి క్రిమిలేయర్‌ను వర్తింపజేయా లని జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారంచైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాదిగ రత్నం, సత్యన్న మాదిగ, వీరపోగు సోమన్న, కాశపోగు సూరిబాబు, కాశపోగు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: రాష్ట్రంలో ఎస్సీ వర్గీక రణపై బీజేపీ, టీడీపీ కుట్రలను వ్యతిరేకిస్తున్నామని రాయలసీమ మాల మహానాడు రాష్ట్ర నాయకుడు యాట ఓబులేసు అన్నారు. గురువారం సునయన ఆడిటోరియంలో షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణపై జిల్లా యంత్రాంగంతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమి షన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు మాల మహానాడు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రద్దుతో పాటు ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ను, క్రిమిలేరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవస్వామి, ఎంవీ స్వామి, శీలం శేషు, నాగరాజు, నాగేష్ పాల్గొన్నారు.



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం ఇస్తున్న దండు వీరయ్య మాదిగ



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

కర్నూలు అర్బన్: షెడ్యూల్డ్ కూలలను ఏబీసీడీలుగా వర్గీకరించి న్యాయం చేయాలని రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం మల్లికార్జున, బాలరాజు, పరమేష్, సాములు పాల్గొన్నారు.

● షెడ్యుల్డ్ కూలలను ఏబీసీడీలుగా వర్గీకరించి న్యాయం చేయాలని రాయలసీమ యూనివర్సిటీ ఎంఎస్ఎఫ్ నాయకులు గురువారం ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు మద్దిలేటి, కోఆర్డినేటర్ మనింద్ర, కార్యదర్శి భూపాల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ పీడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలను ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలిత కోరారు. గురువారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చాందిని, జిల్లా ఆఫీస్ బేరర్స్ వెల్దుర్తి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సంధ్యారాణి, సుజాతలతో కలిసి ఆమె పీడీకి వినతి పత్రం సమర్పిం చారు. సంపూర్ణ పోషణ, అద్దెల ఎలక్ట్రిసిటీ బిల్లులు నెల నెలా చెల్లించాలని, జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. స్పందించిన ఐసీడీఎస్ పీడీ నిర్మల మాట్లాడుతూ ఈ నెలలో నోటిఫికేషన్ జారీ చేసి ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

కర్నూలు అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. గురువారం డీటీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలతో కలిసి తనిఖీలు చేశారు. నాటు సారా తయా రీకి సిద్ధంగా ఉన్న 2,500 లీటర్ల బెల్లం ఊట, 45 లీటర్ల నాటు సారాయిని ధ్వంసం చేశామని తెలిపారు. శోభ అనే మహిళ వద్ద 15 లీటర్ల నాటు సారా, నీలిషికారీ రాజమ్మ వద్ద 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ నవీన్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, ఇంద్రకిరణ్, తేజ పాల్గొన్నారు.



నాటు సారాను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఇన్‌చార్జి ఈవోఆర్డీగా జాకీర్ హుస్సేన్

కర్నూలు రూరల్ జనవరి2(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఇన్‌చార్జి ఈవోఆర్డీగా జాకీర్‌హుస్సేన్‌ను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జాకీర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవోఆర్డీ అనూరాధ గత నెల 31న పదవీ విరమణ పొందారు. ఈనేపథ్యంలో మండలంలోని దిన్నెదేవరపాడు పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి, సీనియర్ అధికారిగా పనిచేస్తున్న జాకీర్ హుస్సేన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కర్నూలు మండలానికి రెగ్యులర్ ఈవోఆర్డీని నియమించే వరకు జాకీర్‌ను కొనసాగించనున్నారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

కర్నూలు కల్చరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి అన్నారు. గురువారం నూతన సంవత్సర ఆరంభ వేడుకల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్‌లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కోడుమూరు ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి వలీ, ఆఫీస్ బేరర్లు కృష్ణారెడ్డి, ప్రసన్న, రమేష్, వెంకటేశ్వర్లు, కనకలత, కర్నూలు సిటీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు కాశన్న పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని భైరాపురం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలను పరిష్కరించాలనే లక్ష్యంతోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. డిసెంబరు 6 నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఓర్వకల్లు మండలంలో ముగిశాయి. కార్యక్రమంలో డీటీ షర్మిలారెడ్డి, సర్వేయర్ శంకర్ మాణిక్యం, పంచాయతీ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.నాగేషాచలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచు, కో అప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ఎంపీఈవోలు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎంపీఈవోలు రైతులకు అందు బాటులో ఉండాలని ఏవో మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీలో రైతులు సాగు చేసిన పం టలను ఎంపీఈవోలు పంట నమోదు తప్పనిసరి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, శశిదేవి, సంధ్య, నాయక్, నాగన్న, భరత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రాణెమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు, సర్పంచులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సర్పంచులు, ఆర్‌డ బ్ల్యూఎస్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమా వేశంలో ఏపీవో రామన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. గురువారం ఓర్వకల్లులోని ఉపాధి హామీ పథకంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన పనిదినాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఏపీవో ఈసీ టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉపాధి కింద చేపట్టిన పనులకు వేతనాలు వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఏపీవో కుమార సాయినాథ్, ఈసీ టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

అధికారులు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు





ఎమ్మెల్యే గౌరు చరితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న యూపీఎస్ఎఫ్ నాయకులు



జడ్పీ సీఈవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు న్యూసిటీ/ కల్లూరు/ అగ్రికల్చరల్/ ఎడ్యుకేషన్/ కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో కలెక్టర్ రంజిత్ బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబుకు అధికారులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మా ట్లాడుతూ గత సంవత్సరంలో జరిగిన తప్పిదాలను మరచిపోయి భవిష్యత్తులో ఎలాంటి తప్పు లు చేయకుండ ప్రతి ఒక్కరూ కృతనిశ్చయంతో విధులు నిర్వహించాలన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన



విజేతలతో కలెక్టర్, డీఈవో, ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అమలాపురంలో జరిగిన అండర్-14 బాలుర క్రికెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంటులో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచింది. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి నేతృత్వంలో క్రికెట్ విజేతలతో కలిసి కలెక్టర్ పి.రంజిత్ బాషా ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ జిల్లాకు పేరు తీసుకువచ్చిన క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. అలాగే పాట్నాలో జరగబోయే జాతీయ స్థాయి క్రికెట్‌కు ఎంపికైన నలుగురు క్రీడాకారులను అభినందించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నారు. అనంతరం డీఈవో శ్యామ్యూల్ పాల్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు గిడ్డయ్య, శ్రీనాథ్‌లను, కోచ్ మేనేజర్లు శేఖర్, హుకుం సింగ్, వెంకటేశ్వర్లు, పాల్ సుధాకర్, రఫీక్ సుబ్రహ్మణ్యంలను కలెక్టర్ ప్రశం సించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలు పరమేష్, సుంకారావు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆఫ్రీద్ బాషా



షేక్ ఆఫ్రీద్ బాషా

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని భావనగ ర్‌లో ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు జరగబోయే 74వ సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కర్నూలు క్రీడాకారుడు షేక్ ఆఫ్రీద్ బాషా ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలిమ, కార్యదర్శి భానుప్రసాద్ గురువారం తెలిపారు. గత డిసెంబరు నెలలో పశ్చిమగోదావరి జిల్లాలో మార్టేరు గ్రామంలో 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు అర్హత సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంపికైన క్రీడాకారుడని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, వ్యాయామ ఉపాధ్యాయుడు ముస్తహీర్ అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరగబోయే అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొంటారని ఎస్జీఎఫ్ కార్యదర్శి సి.హర్షవర్దన్ గురువారం తెలిపారు. బాలురు విభాగంలో సి.మహేంద్ర, యు.వినోద్ కుమార్, కే.హిమేష్ రోహిత్ రెడ్డి, టి.పరుషరాముడు, ఎస్.వెంకటేష్, బీజీ శివప్రసాద్, ఏ.మ హేష్ కుమార్ ఉన్నారు. అలాగే బాలికల విభాగంలో ఆర్.సాయి ప్రియ, ఎస్.మహాలక్ష్మి, బి.శ్రీగ్న, సి.క్రిష్ణప్రియ, జి.అర్చన, కే.సాయి నవ్యశ్రీలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా డీవీఈవో వై.పరమేశ్వరరెడ్డి, హర్షవర్దన్‌లు అభినందించారు.

నైతిక విలువలు అలవర్చుకోవాలి



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సొంత ఖర్చులతో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. ప్రిన్సిపాల్ సుంకన్న మాట్లాడు తూ తమ కాలేజీలో చదివిన విద్యార్థులు ఉన్నత కోర్సుల్లో చేరుతున్నారని, ఇది తమకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెహిమాన్, జలగంగాధర్, రాజా నాయక్, శ్రీనివర్ధన్ కుమార్, సరస్వతీ, అనురాధ, జ్యోత్స్న పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్ కోసం దరఖాస్తులు

గూడూరు, జనవరి 2: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక (గెస్టు ప్యాకల్టీ) నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జనవరి 5న ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులతో పాసై ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు ధృవపత్రాలతో హాజరు కావలెను. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ రమణ 9848285914 సెల్ నెంబరును సంప్రదించా లని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కల్లూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అభిమానులు ఇచ్చిన పుస్తకాలు, పెన్సి ళ్లు, స్వీట్లను ఆయన గురువారం పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

సి.బెళగల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఏటీ తిమ్మన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల యూటీఎఫ్ నాయకుడు కిశోర్‌కుమార్ అధ్యక్షతన ఎంఈవోలు జ్యోతి, ఆదాం బాషా చేతుల మీద డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్ఎంసీ కమిటీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు, అనుమన్న, అనుమంతు, మునిస్వామి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ రెవెన్యూ డైరీ ఆవిష్కరణ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ఏ రెవెన్యూ డైరీ-2025ని గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆవిష్కరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్య, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, పరిపాలన అధికారి విజయశ్రీలను ఏపీఆర్ఎస్ఏ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు రజనీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సి.నాగరాజు, సెక్రటరీ ఎం. లక్ష్మిరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ లోకేశ్వరి, బీఎల్ కృష్ణవేణి, కే.రఘుస్వామి, శివపార్వతి, రామాంజనే యులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నర్సింగ్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు హాస్పిటల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఎస్పీ సావిత్రీ బాయితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ విమలమ్మ, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి, ఉపాధ్యక్షులు జి.శాంతి భవాని, ప్రధాన కార్యదర్శి సి.బంగారి, కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు సోమేశ్వరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాణించాలి

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం లీగల్ అడ్వైజర్ దారా పవన్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక నగరేశ్వర ఆలయంలో కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ ప్రమాణ స్వీకార కరపత్రాలను విడుదల చేశారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం నిధులు, కేటాయించాలని కోరారు. ఆర్యవైశ్యులు వ్యాపాంతో పాటు రాజకీయంలో కూడా ముందుండాలన్నారు. సుంకు రవి, ముత్యాల రాజశేఖర్, మెడికల్ కాశీ విశ్వనాథ్, సోడాల రమ, ముత్యాల కాశీ, రత్నయ్యశెట్టి, కృష్ణ, సుదర్శన్ శెట్టి, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

కూటమితోనే గ్రామాల అభివృద్ధి


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఆస్పరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, బీసీ సెల్ సెక్రెటరీ ఉచ్చీరప్ప యాదవ్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ అన్నారు. గురువారం మండలంలోని జోహరాపురం గ్రామంలో రూ.15 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కరుణాకర్, దశరథుడు, గురు స్వామి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బడికిరాని విద్యార్థులను రప్పించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలుచేయాలని సూచించారు. శుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని కోరారు. ఎస్ఎంసీ చైర్మన్ల పాత్రపై రిసోర్స్ పర్సన్ సురేంద్ర బాపూజీ వివరించారు. ఎంఈవో-2 శ్రీనివాసులు డీఆర్పీ వెంకటస్వామి, సీఆర్పీలు జగదీష్, మనోజ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ధార్మిక వ్యవస్థ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

ఆదోని టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించి ప్రభుత్వ నియంత్రణను తొలగిండానికి ఉత్తమ ధార్మిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, జిల్లా కోశాధికారి కొంగే పంపాపతి అన్నారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ, చట్ట సవరణ కోసం వీహెచ్‌పీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 5వ తేదీన విజయవాడ హైందవ శంఖారావంలో పాల్గొనదలచిన సభ్యులు పేర్లను నమోదు చేసుకుని, 4న మధ్యాహ్నం మూడు గంటలకు మున్సిపల్ మైదానంలో హాజరు కావాలన్నారు.

కొత్త ఏడాది వెలుగులు నింపాలి


వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ రమాదేవి

తుగ్గలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని తహసీల్దార్ రమాదేవి ఆకాంక్షించారు. గురువారం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, సిబ్బంది పనిచేయాలని సూచించారు. డీటీ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, అసిస్టెంట్ రాముడు, వీఆర్వోలు నాగేంద్ర, కాశీ రంగస్వామి, వెంకట్రాముడు, నాగలక్ష్మి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి


ఎంపీతో తుగ్గలి మండల టీడీపీ నాయకులు

తుగ్గలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలానికి నిధులు మంజూరు చేసి, సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ముక్కెళ్ల పంచాయతీ సలహాదారుడు రామచంద్ర కోరారు. గురువారం పత్తికొండలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు సమస్యలను తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ మునెప్ప, రాంపల్లి శ్రీనివాసులు, ఆదినారాయణ, మైరాముడు తదితరులు ఉన్నారు.

కేఈ కుటుంబంతోనే అభివృద్ధి

వెల్దుర్తి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేఈ కుటుంబంతోనే పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ ఎన్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం మాట్లాడుతూ గతంలో కేఈ ప్రభాకర్ ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా కేఈ సారధ్యంలో కేఈ శ్యాంబాబు సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. సూదేపల్లె జయరాముడు, సిద్దనగట్టు వెంకటేశ్, మల్లికార్జున, మహేష్ బాబు, ఆనంద్, ఎమ్మార్పీఎస్ నాయకులు గిడ్డయ్య, హరి, గోవర్దనగిరి గోపాల్, క్రిష్ణ, వెంకటేశ్వర్లు, రమణ, మద్దిలేటి, మల్లికార్జున పాల్గొన్నారు.

పోటా పోటీ..

- ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం నాయకుల ప్రయత్నాలు
- తెరపైకి పత్తిపాడు ఎమ్మెల్యే సోదరుడు?
- పదవి ఎవరిని వరించేనో?



ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఆలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మెన్ పదవిపై తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. ఇప్పటికే పదవి కోసం ప్రయత్నాలు ఆరంభించారు. చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వు కావడంతో ఆ వర్గానికి చెందిన నాయకులు ఇప్పటికే ఆపార్టీ ముఖ్యనేతల అనుగ్రహం పొందేందుకు నానాపాట్లు పడుతున్నారు.

మద్దతు కూడగట్టుకునే యత్నం...

ఎమ్మెల్యే తర్వాత ముఖ్యమైన పది కావడతో టీడీపీలోని దళిత నాయకులు ముఖ్యనా యలకు ఫోన్లు చేసి మద్దతు కూడ గగడుతున్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల పార్టీ కన్వీనర్లకు ఫోన్ చేసి లెటర్ ఇవ్వాలని కోరినట్లు తెలుస్తుంది. హొళగుంద మండలానికి చెందిన సీనియర్ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి, ఆలూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు చెన్నంగి నరసప్ప, బిల్లేకల్ వెంకటేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్, టీడీపీ నాయకులు కొమ్ము రాజు పదవిని ఆశిస్తున్నారు.

ఎమ్మెల్యే సోదరుడు కూడా..

పదవి కోసం ఇప్పటికే పార్టీలోని నాయకులు పోటీ పడుతుండగా అనూహ్యంగా గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు సోదరుడు త్యాగరాజు పేరు తెరపైకి వచ్చింది. ఈయన పట్ల టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కూడా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే విషయంపై ఈనెల 5న ఎమ్మెల్యే రామాంజినేయులు ఆలూరుకు రానున్నట్లు సమాచారం. మరి చర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో చూడాలి

పేదల స్థలాలను అమ్ముకున్నారు

- గత వైసీపీ ప్రభుత్వంపై ఎమ్మెల్యే శ్యాంబాబు ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాల పట్టాలను అమ్ముకున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ధ్వజమె త్తారు. గురువారం మద్దికెరలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే.. గత ప్రభుత్వంలో నాయకులు అమ్ముకున్నారని అన్నారు. పట్టాలు రద్దుచేసి అర్హులైన నిరుపేదలకు మాత్రమే అందజేస్తా మన్నారు. తాలుకాలో సీసీ రహదారులకు రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పేదలకు అన్ని సంక్షేత పథకాలు అందుతున్నాయన్నారు. రూ.5 కోట్లతో మద్దికెర-బురుజుల రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని, జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కొళాయి ఉచితంగా ఇస్తామని తెలిపారు. మాజీ జడ్పీటీసీలు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, నాయకులు పెరవలి రామాంజులు, గడ్డం రామాంజులు, జంబునాథ్ రాయుడు, పారా రాఘవేంద్ర, పారా విఠోభ, సంజప్ప, హరినాథ్‌గౌడు తదితరులు ఉన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి

- రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సావిత్రి

ఆదోని టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి కృషి చేస్తానని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి అన్నారు. పట్టణానికి చెందిన న్యాయవాది సావిత్రి గురువారం విజయవాడలో చైర్‌పర్సన్‌గా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడు తూ విద్య, ఉపాధి అవకాశాలు లేక రజకులు కులవృత్తి పైనే ఆధారపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోలు ఉన్నా, అమలుకు నోచుకోలేదని, ఇకనుంచి అమల య్యేలా చూస్తానని అన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో వేడుకలు



ఆర్డీవో భరత్ నాయక్‌తో ఉద్యోగులు

పత్తికొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో సంతాప దినాల కారణంగా మంగళవారం వేడుకలు నిర్వహించలేదు. తహసీల్దార్లు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసాపురం వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు. మద్యాన్ని తరలిస్తున్న ఎరుకల ఈరన్నను అదుపులోకి తీసుకుని బైకును సీజ్ చేశామని, కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

పదవులు ఇవ్వాలి

ఆదోని రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ జెండా మోసిన వారికే నామినేటెడ్ పదవులు ఇవ్వాలని టీడీపీ నాయకుడు దిబ్బనకల్లు లక్ష్మన్న కోరారు. గురువారం విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసుల పాలయ్యామని, పదవులు కేటాయించాలని సీఎం చంద్ర బాబు, మంత్రి లోకేష్‌ను కోరారు. ఆదోని మార్కెట్ చైర్మన్ పదవి కురువలకు కేటాయించాలని దిబ్బనకల్లు తెదేపాకు కంచుకోటన్నారు. ఈ కార్యక్రమంలో గణేకల్ విరుపాక్షి, అలసంద గుత్తి వెంకటేశులు, విరుపాపురం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు

ఆలూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని డీటీ విజయ కుమార్ అన్నారు. గురువారం అంగస్కల్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొల్లమ్మ, దేవేందర్, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్‌వోలు ఆనంద, వన్నూర్ పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

ఆలూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు ముత్యాల గాదిలింగ కోరారు. గురువారం కర్నూలులో ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు.ఐ

కూటమితోనే అభివృద్ధి

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని జనసేన నాయకుడు వైక్రాంతి కుమార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే శ్యాం బాబు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు మొక్కలు, పెన్నులు, పుస్తకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జయరాం, దూదేకొండ ఖాజా, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

అధ్వానంగా రణమండల కొండ దారి


కంకర తేలిన రహదారి ఇదే..

ఆదోని టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పొలిమేరలోని రణమండల కొండకు వెళ్లే రహదారి ఛిద్రమై, కంకర తేలింది. దీంతో భక్తులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలను పూడ్చి రహదారిని బాగులు చేయాలని సమాజ సేవా కార్యకర్త నసీరుద్దీన్ పటేల్, సాకరే ఈరన్న, మరియాని చెన్నబసప్ప కోరారు.

అభివృద్ధికే గ్రామసభలు

హొళగుంద, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మేజర్ పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. గురువారం సర్పంచ్ చాలువాది రంగమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గ్రామ సభలో ప్రజలు ఇచ్చిన సమస్యల అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు, పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న తహసీల్దార్ సతీష్

హొళగుంద, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ సతీష్ అన్నారు. గురువారం మాట్లాడుతూ గత రీ-సర్వేలో భూ సమస్యలు తలెత్తడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీఆర్‌వో సూరంజినేయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఆలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు శాసం రామాంజినేయులు పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని హులేబీడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన అంబేడ్కర్ అవమానాలు, అంటరాని తనాన్ని భరించి, ఉన్నత చదువులు చదివి భారత రాజ్యాంగాన్ని రచించాడన్నారు.

భవనాన్ని కేటాయించాలి

ఆలూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హత్తిబెళగల్ గ్రామం ఆరోగ్య ఉపకేంద్రానికి పాత పంచాయతీ భవనం కేటాయించాలని గ్రామస్థులు జగదీష్ స్వామి, విశ్వేశ్వరయ్య స్వామి ఖాదర్ బాషా, రాజశేఖర్, చంద్రశేఖర్ కోరారు. గురువారం కార్యదర్శి జిలాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రికి సొంత భవనం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రంగనాయకులు, ఈరన్న, రంగన్న, నాగరాజు, బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

మద్దికెర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యముందని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మద్దికెర గ్రామంలో తారురోడ్డు పనులకు భూమి పూజ, రూ.65 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు, గోకులం షెడ్డు, కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ బండారు సుహాసిని ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ మద్దికెర వెనుకబడి ఉందన్నారు. జనవరి 28వ తేదీన పార్లమెంటు సమావేశాలు ఉంటాయని, మద్దికెర సమస్యలన్నీ మంత్రి నితీష్ గడ్కరి దృష్టికి తీసికెళతా అన్నారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్తికొండ తెలుగుదేశం పార్టీకి కంచుకోట అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అనిత యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

- రూ.1.5 లక్షల నగదు, సామగ్రి అపహరణ


చోరీపై విచారణచేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

పత్తికొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి రహదారి మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న జిమ్మిప్లాస్టిక్ అండ్ స్టీల్ దుకాణంలో చోరీ జరిగింది. రూ.1.5లక్షలు, రూ50వేల విలువైన సామగ్రి దోచుకెళ్లినట్లు దుకాణం యజమాని జమ్మన్న పోలీసులకు ఫిర్యాదుచేశాడు. చేరుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు దొంగలు దుకాణం పైబాగంలోని రేకును తొలగించి లోపలికి ప్రవేశించి, చోరీ అనంతరం బాత్రూం తలుపులు తీసుకుని ఉడాయిం చినట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీని పరిశీలించి మొహానికి మాస్కు వేసుకున్న దొంగను పరిశీలించారు. పోలీసులు కేసును విచారణ చేస్తున్నారు.

పనిచేయని డిజిటల్ కీ


దేవనకొండ తహసీల్దార్ కార్యాలయం

దేవనకొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి తహసీల్దార్ డిజిటల్ కీ పని చేయడం లేదు. దీంతో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తహసీల్దార్ లోకేశ్వరయ్య మాట్లాడుతూ సాంకేతిక కారణాలతోనే డిజిటల్ కీ బ్లాక్ అయిందని, పరిష్కరించి, జారీ చేస్తామన్నారు.

ఫలితాల సాధనకు కృషి చేద్దాం


స్టడీ మెటీరియల్ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎస్టీయూ అకడమిక్ కమిటీ సభ్యుడు మహాదేవప్ప కోరారు. గురువారం పట్టణంలోని ఆర్జీ నగర్ జడ్పీహెచ్ పాఠశాలలో ఎస్టీయూ రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం టీకే శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను సబ్జెక్టు నిపుణులతో రూపొందించామన్నారు. తక్కువ సమయంలో కనీస మార్కులు తెచ్చుకునేందుకు ఉపయక్తంగా ఉంటుందని అన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, నరసింహ రెడ్డి, వీరప్ప, దాసన్న, భాస్కర్, ప్రభన్న, వెంకటరాముడు, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడానికి కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- సబ్ జైలు సూపరింటిండెంట్ నజీర్ అహ్మద్



ఆదోని రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు ఆదోని సబ్ జైలు సూపరింటిండెంట్ నజీర్ అహ్మద్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ముద్దాయిలను చూడడానికి వస్తే డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి?

జవాబు: ముద్దాయిని చూడడానికి ముగ్గురికి, వారానికి రెండుసార్లు గుర్తింపు కార్డు తీసుకొని అనుమతి ఇస్తాం. డబ్బు వసూలు చేయడంలేదు, తీసుకున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ముద్దాయిల్లో సత్ప్రర్తన తేడానికి ఎలా కౌనెల్సింగ్ ఇస్తారు?

జవాబు: సమస్య వచ్చినప్పుడు శాంతియుతంగా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని న్యాయవాదుల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తాం.

ప్రశ్న: పలుకుబడి ఉన్న ముద్దాయిలకు స్పెషల్ ట్రీట్ ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: నిబంధనల ప్రకారమే నడుచుకుంటాం, ఎవరి నీ స్పెషల్‌గా ట్రీట్ చేయం.

ప్రశ్న: న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ముద్దా యిలకు సాయం చేస్తారా?

జవాబు: ఎవరూ లేని, ఆర్థిక స్థోమత లేని ముద్దాయిల నుంచి అర్జీ తీసుకుని కోర్టుకు పంపుతాం. కోర్టు వారే న్యాయవాదులను ఏర్పాటు చేస్తారు.

ప్రశ్న: సబ్ జైలు సామర్థ్యం, సిబ్బంది వివరాలు చెప్పండి

జవాబు: జైలులో మహిళలకు ఒకటి, పురుషులకు ఆరు సెల్‌లు ఉన్నాయి. మొత్తం 55 మంది ముద్దాయిలు ఉండ వచ్చు. నాతో కలిపి 13మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

ప్రశ్న: ఇతర రాష్ట్రాల్లో ఉన్న బంధువులు ముద్దాయిలతో మాట్లాడే అవకాశం ఉందా?

జవాబు: వారానికి రెండుసార్లు వీడియో కాల్‌లో మాట్లాడానికి అవకాశం కల్పిస్తాం. ఇందుకు రూ.100లు డిపాజిట్ చేయాలి.

ప్రశ్న: ముద్దాయిల ఆరోగ్య విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

జవాబు: రోజూ యోగా, వ్యాయామాలు చేయిస్తాం. అనారోగ్యానికి గురైతే పోలీసు సిబ్బందితో జైలు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తాం.

స్వర్ణ రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. ధనుర్మాసం తదియ రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి మండపంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రస్వామి ఇష్టమైన గురువారం దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి



ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో

నందవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె, గురుజాల గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు. పీఏసీఎస్, ఈకేవైసీ, ఎంఎస్ఎంఈ సర్వేలను ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగుల హాజరు రిజిష్టర్, టూర్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి బయోమెట్రిక్ వేయాలని, సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జరుగుతున్న పనులను పూర్తి చేసి ఓడి మీదా ఆయా శాఖలకు సంబంధించిన పనులకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గోనెగండ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. గురువారం మండల మండల పరిధిలోని హెచ్ కైరవాడిలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి ఆ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గుర్రై రామాంజి అనే వ్యక్తి తీవ్రంగా గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడికల్ గ్రామానికి చెందిన చిన్న గుంటప్ప కూమారుడు బి.రామాంజి (39) లక్ష్మణ్ థియేటర్ వైపు వెళ్లే దారిలో కరెంట్ వైరును పట్టుకున్నాడు. దీంతో శరీరమంతా కాలి పడిపోగా అక్కడ ఉన్న ప్రజలు వెంటనే అంబులెన్సుకు ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా : రాఘవేంద్ర రెడ్డి



భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసి అక్షరాస్యత శాతం పెంచుతానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల టీడీపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్ అధ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారుఉ. టీడీపీ అధికారం చేపట్టిన ఆరు నెలల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఇందులో భాగంగానే విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేదల ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేలా ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, రైతు విభాగపు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పుసుల్తాన్, మాజీ ఎంపీటీసీ సొద్ది బసవరాజు, ఎంపీడీఓ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కోసిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సరం వేడుకలు తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ నిత్యానందరాజుకు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, ఆర్ఐ శ్రీరాములు, సర్వేయర్లకు పూలమాలలు శాలువలతో సన్మానించారు. అనంతరం తహసీల్దార్ నిత్యానందరాజు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు గట్లు

● సగంలోనే నిలిచిన జీడీపీ ఎడమ కాలువ బ్రిడ్జి పనులు
● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



ప్రమాదకర మలుపు ఉన్న కుడికాలువ కల్వర్టు

గోనెగండ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల మలుపుల దగ్గర ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. కాంట్రాక్టర్‌లు ముందు చూపు లేకుండా కాలువ గట్లకు ఉన్న ప్రహరీని తొలగించారు. దాదాపు మూడుళ్లవుతున్నా పట్టించుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మరిందని ప్రయాణికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్, అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా కాలువ గట్లకు ఉన్న రాతి కట్టడాన్ని ఎందుకు తొలగించారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. దీంతో కల్వర్టుల దగ్గర మలుపు ఉన్నా అందుకు సంబంధించి ప్రమాదాన్ని సూచించే బోర్డులు గాని రేడియం స్టిక్కర్‌లు గాని ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి పూట ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, ఎర్రబాడు, ఒంటేడుదిన్నె, గ్రామాలకు ఇదే దారి వెంట వెళ్లాల్సి ఉంది. ఈ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోల్లో ప్రతి రోజూ ఇదే దారి వెంట పాఠశాలకు వెళ్తుంటారు. మూడేళ్ల క్రితం మలుపు దగ్గర ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి చెందాడు. పత్తికొండకు చాలా మంది ఇదే దారి వెంట వాహనాల్లో వెళ్తుంటారు. ఈ రోడ్డు రద్దీగానే ఉంటుంది. జీడీపీ కట్ట ఎత్తు పెంచే కాంట్రాక్టర్ ముందు జాగ్రత్తలు పాటించకుండా జీడీపీ కుడి, ఎడమ కాలువలకు ఉన్న కల్వర్టుల రాతి కట్టడాన్ని తొలగించడంతో రాత్రి పూట మలుపుల దగ్గర ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే గత కొన్ని నెలల క్రితం ఎడమ కాలువకు చెందిన కల్వర్టు దగ్గర కొత్తగా చిన్న బ్రిడ్జిని నిర్మించారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు సగంలోనే నిలిపివేశారు. ఎడమ కాలువ మలుపు దగ్గర తాత్కాలిక ప్రహరీ నిర్మించడం మరిచారు. ఇప్పటికైనా అధికారులు రాత్రిపూట ప్రమాదాలు జరగకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సగంలోనే నిలిచిన ఎడమ కాలువ బ్రిడ్జి పనులు

నిందితుడిపై చర్యలు తీసుకుంటాం

ఆందోళనకారులు, విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థినులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బనవాసి గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం బనవాసి ఫారంలోని ఆదోని రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కళాశాల ఎదుట పలు విద్యార్థి సంఘాల నాయకులు, కళాశాల విద్యార్థినులు ఆందోళనకు దిగారు. దీంతో ఎమ్మెల్యే ఆందోళనకారులు, విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన సంఘటనపై విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడారు. తమకు కళాశాలలో రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సందర్భం గా విద్యార్థినులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ కె.శ్రీనివాసులు, మండల నాయకులు దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, వీరనాగప్ప, సురేష్‌చౌదరి, నరసన్నగౌడు, సోగనూరు జగదీష్, రాఘవేంద్ర, భీమేష్, కురువ మల్లయ్య ఉన్నారు.

దుకాణంలో చోరీ

పత్తికొండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి రహదారి మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న జిమ్మిప్లాస్టిక్ అండ్ స్టీల్ దుకాణంలో చోరీ జరిగింది. రూ.1.5లక్షలు, రూ50వేల విలువైన సామగ్రి దోచుకెళ్లినట్లు దుకాణం యజమాని జమ్మన్న పోలీసులకు ఫిర్యాదుచేశాడు. చేరుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు దొంగలు దుకాణం పైభాగంలోని రేకును తొలగించి లోపలికి ప్రవేశించి, చోరీ అనంతరం బాత్రూం తలుపులు తీసుకుని ఉడాయించినట్లు గుర్తించారు. సీసీ పుటేజీని పరిశీలించి పోలీసులు కేసును విచారణ చేస్తున్నారు.

నీలకంఠేశ్వరుడి జాతరకు సిద్ధమవుతున్న రథం



రథశాల నుంచి బయటకు తీసుకొచ్చిన రథంతో ఆలయ కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి రథాన్ని దేవాలయ కమిటీ సభ్యుల సమక్షంలో రథశాల నుంచి బయటికి తీశారు. గురువారం ఉదయం శుభ సమయాన రథాన్ని కమిటీ సభ్యుల సమక్షంలో పరిశీలించి పూజ కార్యక్రమాలతో రథాన్ని బయటికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వంశపారంపర్య ధర్మకర్త మాచాని నాగరాజు నీల మురళీధర్ మాట్లాడుతూ జాతర పురస్కరించుకొని 13న పార్వతీపరమేశ్వర కళ్యాణ మహోత్సవం, 14వ తేదీన ప్రభావళీ అన్నదాన కార్యక్రమం, 15వ తేదీన మహారథోత్సవం జరుగుతుందని తెలిపారు.

పోస్టర్లు విడుదల



అంతర్ రాష్ట్ర ఫుట్ బాల్ పోటీల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని ఎమ్మిగనూరు పట్టణంలోని ఈనెల 15నుంచి ఫుట్ బాల్, 16వ తేదీ నుంచి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోటీలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి విడుదల చేశారు. టీడీపీ కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈనెల 16నుంచి కానున్న ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల పోస్టర్లు విడుదల చేశారు. 16న 4 పాలపళ్ల సైజు, 17న 6 పాల పళ్లసైజు, 18వ తేదీ న్యూ క్యాటగిరి సైజు, 19వ తేదీ సీనియర్ సైజ్ ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉంటాయి. వివరాలకు 9441079013, 9989217564, 9985055355, 9704603581 నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామదాసు గౌడ్, నాయకులు మహేంద్ర బాబు, విరుపాక్షి రెడ్డి, భాస్కర్, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి, మురళి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన డీఎస్పీ

మంత్రాలయం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు కలిశారు. గురువారం కర్నూలులోని డీఐజీ కార్యాలయంలో డీఎస్పీతో పాటు మంత్రాలయం సీఐ రామాంజులు కలిసి డీఐజీని శాలవ కప్పి పండ్లను అందజేసి సన్మానించారు.



డీఐజీ కోయ ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, మంత్రాలయం సీఐ

ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకు న్యాయం



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న కదిరికోట అదెన్న

ఎమ్మిగనూరు/ ఎమ్మిగనూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఎస్సీ ఉపకులాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గురువారం అభిప్రాయ సేకరణ చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ దళిత నాయకులు కదిరికోట అదెన్న, దళిత రచయిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్‌లు ఏకసభ్య కమిషన్‌ను కలిసి వర్గీకరణపై పలు అభిప్రాయాలను వెలిబుచ్చి వినతిపత్రం అందజేశారు. బుడగ జంగం హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి, సాల్మన్, వీరేష్ పాల్గొన్నారు.

650 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



హనుమాపురం కొండల్లో నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామ శివారులోని క్వారీ కొండలో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తిక్ సాగర్ ఆధ్వర్యంలో 650 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోసిగి పెద్దకడుబూరు మండలాల్లో అక్రమ కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్స్ భరత్, మునిరంగడు ఉన్నారు.

బండేగురుస్వామికి సత్కారం

నందవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింత గ్రామంలో గురువారం బండేగురు స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన కర్ణాటక భక్తులు, గ్రామ ప్రజలు మఠం ఉపపీఠాధిపతి బండేగురు స్వామి, టీడీపీ సర్పంచ్ అక్కమాంబ దేవిని వారు గజమాలతో సత్కరించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం బండేగురుస్వామి దగ్గరకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక భక్తులతో పాటు తెలంగాణకు చెందిన భక్తులు వచ్చి పూజలు చేశారు.

వీరేష్ కుటుంబానికి అండగా ఉంటా



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరమాన్ దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వీరేష్ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఆసుపత్రిలో ఉన్న వీరేష్ మృతదేహాన్ని ఎమ్మెల్యే పరిశీలించి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే బంధువులను పరామర్శించి దహన సంస్కారాల కోసం రూ.10 వేలు నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరేష్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు నాగేష్, కొండన్న గౌడ్, సురేష్ చౌదరి, డీలర్ ఈరన్న, రామకృష్ణ నాయుడు, జగదీష్, అంబేడ్కర్, మాచాపురం కాశీం వలి, వినయ్‌లు పాల్గొన్నారు.

కోసిగిలో సిద్ధారుడ జ్యోతి యాత్ర



ర్యాలీని నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో సిద్ధారుడ జ్యోతి యాత్ర నిర్వహించారు. సిద్ధారుడ జ్యోతి యాత్ర వాహనాన్ని కోసిగిలోని రంగప్ప గుట్టు దగ్గర నుంచి హాల్వి రోడ్డులో ఉన్న సిద్ధారుడ శాంతాశ్రమం వరకు డప్పు వాయిద్యాల మధ్య ర్యాలీగా తీసుకెళ్లారు. కర్ణాటకలోని హుబ్లీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర పలు రాష్ట్రాల మీదుగా జ్యోతి యాత్ర కొనసాగుతుందన్నారు. యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చైర్మన్లు కృషి చేయాలి

కోసిగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎంసీ చైర్మన్లు పాఠశాల అభివృద్ధికి చైర్మన్లు కృషి చేయాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి శోభారాణి అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్లకు ప్రధానోపాధ్యాయులకు కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో

జీవో నెం 117ను రద్దు చేయాలి

గోనెగండ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జీవో నెం 117ను పూర్తిగా రద్దు చేసి పాత విధానంలోనే ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని డీటీఎఫ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, మహబుబ్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హెచ్ కైరవాడి ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు భారంగా ఉన్న యాప్‌లను అన్నింటిని రద్దు చేయాలని, ప్రతి పాఠశాలకు కంప్యూటర్ అపరేటర్‌ను నియమించాలని, 10వ తరగతి వరకు సమాంతర విద్యావిధానం అమలు చేయాలని కోరారు. అలాగే పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, హెల్పర్లు, వాచ్‌మెన్‌లకు ప్రతి నెలా జీతాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం క్యాలెండర్ విడుదల చేశారు.

గ్రామ సమస్యలు పరిష్కరించేందుకు కృషి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సతీష్

గోనెగండ్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఈవోఆర్‌డీ అనంతశయన, గోనెగండ్ల పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం గోనెగండ్లతోపాటు మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ అనంతశయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. గోనెగండ్లలో నాలుగు రోజులకోసారి కొళాయిలకు నీరు వదులుతున్నారని, రోజు మార్చి రోజు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పలు వార్డుల సభ్యులు పాల్గొన్నారు.

మాధవరం చర్చి కమిటీ ఎన్నిక



చర్చి కమిటీ నాయకులను ప్రకటిస్తున్న పాస్టర్ జాన్‌వెస్లీ

మంత్రాలయం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎస్ఐ చర్చి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాస్టర్ రెవ.జాన్‌వెస్లీ తెలిపారు. గురువారం సీఎస్ఐ చర్చి డివిజనల్ చైర్మన్ రెవ.హెచ్. వేదనాయకం ఆదేశాల మేరకు ఫాస్టర్ రెవ.జాన్‌వెస్లీ, క్రైస్తవ సంఘం 2025 నూతన సంఘ పెద్దలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంఘం సెక్రటరీగా భూపతి, నతానియేలు, తలమారి తిమ్మోతి, మేకల తిమ్మోతి, పాల్‌రాజు, బండారి జగదీష్, వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరి కాలం రెండేళ్లు ఉంటుందని, ఈ కాలంలో చర్చి అభివృద్ధి కార్యకలాపాలు ఉంటాయని తెలిపారు.